
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 3 ఫిబ్రవరి 2025

డిజిటల్ చెల్లింపుల దిశగా..

మహిళా సంఘాలు

- శ్రీనిధి నుంచి ఉచితంగా పాయింట్ ఆఫ్ సేల్ మిషన్లు
- ఇరు జిల్లాల్లో 239 మందికి పీఓఎస్ పరికరాలు
- సత్వర నగదు లావాదేవీలు, పారదర్శకతే లక్ష్యం

5

శభాష్.. త్రిష



- టీ-20 ఫైనల్లోనూ అదరగొట్టిన భద్రాద్రి చిచ్చర పిడుగు
- 309 పరుగులు, ఏడు వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ కైవసం
- అవార్డును తండ్రికి అంకితమిచ్చిన త్రిష
- అభినందించిన ఐసీసీ చైర్మన్ జైషా, మంత్రులు పొంగులేటి, తుమ్మల

భద్రాచలం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భద్రాచలం చిచ్చర పిడుగు గొంగడి త్రిష అండర్-19 మహిళల టీ-20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీల ఫైనల్‌లో అదరగొట్టింది. తనదైన శైలిలో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి దుమ్మురేపింది. సౌత్‌ఆఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ తొమ్మిది వికెట్లతో ఘన విజయం సాధించింది. ఇందులో భద్రాద్రి యువతి త్రిష బౌలింగ్‌లో నాలుగు ఓవర్లలో 15 పరుగులిచ్చి అత్యంత కీలకమైన మూడు వికెట్లు తీయడంతోపాటు బ్యాటింగ్ లోనూ రాణించి కేవలం 33 బంతుల్లోనే 44 పరుగులు చేసి సౌత్‌ఆఫ్రికాపై భారత్ పూర్తిస్థాయిలో ఆధిపత్యాన్ని చాటడానికి కారణమైంది. ఈ మెగా టోర్నీలో ఆరంభం నుంచి బ్యాటింగ్, బౌలింగ్‌లో నిలకడగా రాణిస్తూ మొత్తం 309 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచింది. బౌలింగ్‌లోనూ ఏడు వికెట్లు తీసి తన సత్తా చాటింది. దీంతో ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచింది.

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డు తండ్రికి అంకితం

ప్రపంచకప్‌లో త్రిష గ్రూప్ మ్యాచ్‌లతో పాటు కీలకమైన సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో జట్టు విజయంలో కీలకపాత్ర (మిగతా 4వ పేజీలో)



రామయ్యకు ముస్లిం తండ్రీ తనయుల

స్వరనీరాజనం

- కచేరీ నిర్వహించిన మహ్మద్ లాయక్ అహ్మద్, షహబాజ్
- భద్రాచలంలో రెండోరోజు వాగ్గేయకార ఉత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న ఎండీ లాయక్ అహ్మద్, షహబాజ్‌లు

భద్రాచలం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాగ్గేయకార ఉత్సవాలు ఆదివారం కొనసాగాయి. రెండో రోజు ఉత్సవాల్లో వరంగల్‌కు చెందిన మహ్మద్ లాయక్ అహ్మద్, ఆయన కుమారుడు మహ్మద్ షహబాజ్ తమ సంగీత కచేరితో భక్తులను అలరించారు. నారాయణతీర్థ తరంగాల్లోని 'జయజయ స్వామిన్' అనే తరంగంతో ప్రారంభించి రామనామమే జీవనము, ఏడనున్నాడో భద్రాద్రి వాసుడేడున్నాడో, రామా సీతారామా రఘురామ అంటూ భక్తరామదాసు, త్యాగరాజ స్వామివారి కీర్తనలను ఆలపించారు. వారికి మృదంగం జగన్మోహిని, వయోలిన్‌పై సుబ్రమణ్యేశ్వరరాజు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమం అనంతరం వారికి భద్రాద్రి దేవస్థానం తరపున శాలువ, స్వామివారి ప్రసాదం, (మిగతా 4వ పేజీలో)

కథలు.. చరిత్ర నిర్మితాలు

- 'కథానిలయం'తో తెలుగు కథా సాహిత్యానికి ఎనలేని మేలు
- అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఘంటా చక్రపాణి
- ఖమ్మంలో ఘనంగా 'కథానిలయం' వార్షికోత్సవం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

4



అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి ఏడాది గడిచినా బీఆర్ఎస్ నేతలు ఇంకా ఓటమి గాయం నుంచి కోలుకోలేదు. అసెంబ్లీతో పాటు ఖమ్మం, మహబూబాబాద్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఘోర పరాజయం చెందిన విషయం విదితమే. ఎన్నికలకు ముందు 'గెలిచినా ఓడినా ప్రజల్లోనే ఉంటాం, ప్రజాసమస్యలపై పోరాడతాం' అంటూ ప్రకటనలిచ్చిన నేతలు, పోటీచేసిన అభ్యర్థులు ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయాల్లో అతిథి పాత్రలే పోషిస్తున్నారు. బీఆర్ఎస్ అధిష్టానం రాష్ట్రస్థాయిలో ఏదైనా కార్యక్రమానికి పిలుపు ఇచ్చినప్పుడు నియోజకవర్గాలకు వచ్చి వెళ్లడం, అప్పుడప్పుడు ప్రెస్‌మీట్లు పెట్టడం వంటి కార్యక్రమాలకే పరిమితమవుతున్నారు.

వీడని 'కారు' మబ్బులు

- బీఆర్ఎస్‌లో మానని ఓటమి గాయం
- ఓడినా ప్రజల్లోనే ఉంటామని నాడు ఎన్నికల వేళ ఆ పార్టీ నేతల ప్రకటనలు
- నేడు హైదరాబాద్‌కే పరిమితం
- నియోజకవర్గాలకు చుట్టపు చూపుగానే వస్తున్న మాజీలు
- 'స్థానిక' ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం కరువు

ఖమ్మం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ గెలిచింది. ఆ ఒక్క ఎమ్మెల్యే కూడా తర్వాత కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్‌కు అసెంబ్లీలో ప్రాతినిధ్యమే కరువైంది. బీఆర్ఎస్‌కు సంబంధించి ఖమ్మం జిల్లాలో వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి మా త్రమే రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీగా తాతా మధుసూదన్ కొనసాగుతున్నారు. జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తికావడంతో ఆ పార్టీకి స్థానిక సంస్థల్లోనూ ప్రాతినిధ్యం కరువైంది.

'స్థానిక' ఎన్నికల వేళ కేడర్‌లో నైరాశ్యం..

గత అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం స్థానంలో మాత్రమే బీఆర్ఎస్ గెలిచినా ఆ ఎమ్మెల్యే కూడా తరువాత కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీకి ప్రాతినిధ్యం కరువైంది. దీనికి తోడు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలో కూడా బీఆర్ఎస్ లేకపోవడంతో ఆ పార్టీ కేడర్ అధికార కాంగ్రెస్‌పై దూకుడుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు గత ఎన్నికల్లో ఓటమిచెందిన కందాళ ఉపేందర్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, నామా నాగేశ్వరరావు, మదన్‌లాల్, హరిప్రియ, కవిత తదితరులు నియోజకవర్గాలకు దూరంగా ఉంటున్నారు. స్థానికంగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యేలు అప్పుడప్పుడు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రాబోతున్నాయి. పంచాయతీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సొసైటీలు, మునిసిపాలిటీలకు ఎన్నికలు జరగబోతున్నందున పైస్థాయి నాయకత్వం సహకారం ఉంటేనే కిందిస్థాయిలో పోరాడే పరిస్థితి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో అధికార కాంగ్రెస్‌కు ఇద్దరు మంత్రులుండగా జిల్లానుంచే డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహించడంతోపాటు ఇద్దరు ఎంపీలు, ఒక రాజ్యసభ స్థానం కూడా కాంగ్రెస్‌కు ఉంది. కార్పొరేషన్ చైర్మన్ పదవులున్నాయి. వామపక్షాల్లో సీపీఐ కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా కొనసాగుతోంది. అంశాల ఆధారంగా సీపీఎం కొన్నిసార్లు మద్దతుగా కొన్నిసార్లు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌ను ఢీకొనడం బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారనుంది.

ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌దే హవా..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులదే హవా నడిచేది. ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమంలో ఆ పార్టీలో కోలాహలం ఉండేది. కానీ ఎన్నికల్లో ఓటమి తరువాత ఆ పార్టీ నాయకులు, కేడర్‌లో నిస్తేజం ఏర్పడింది. చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అండతో జిల్లాలో తమకు తిరుగుండదని భావించారు. కానీ అభివృద్ధి మాటలతో ప్రజలకు దూరం కావడం, నాయకులు కేడర్‌కు, ప్రజలకు అందుబాటులో లేకుండా తిరగడం, ప్రజల వ్యక్తిగత సమస్యలు, కార్యకర్తల గోడు పట్టించుకోకపోవడంతో క్షేత్రస్థాయిలో అసంతృప్తి గూడుకట్టుకుని అది ఎన్నికల్లో ఓట్లరూపంలో బయటపడింది. దాంతో ఉమ్మడిజిల్లాలో ఎన్నడూలేని విధంగా కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ దక్కింది. 9 మంది ఎమ్మెల్యేలు, ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటుబ్యాంకు బీజేపీకి బదిలీకావడంతో ఆ పార్టీ మరింతగా దెబ్బతిన్నది. ఈ పరిణామాలు బీఆర్ఎస్ శ్రేణులకు మింగుడు పడడంలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం స్థానంలో మాత్రమే బీఆర్ఎస్ గెలవగా మిగిలిన చోట్ల కాంగ్రెస్, టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో విజయం సాధించింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ అప్పుడు అధికారంలో ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఏకపక్షంగా ఆ పార్టీ దూసుకుపోయింది.

నేటినుంచి ఇంటర్

ప్రాక్టికల్స్

- ఖమ్మం జిల్లాలో 89 కేంద్రాలు.. 17,457 మంది విద్యార్థులు
- భద్రాద్రి జిల్లాలో 64కేంద్రాలు.. 10,081 మంది విద్యార్థులు
- ప్రయోగశాలల్లో రసాయనాలు, పరికరాల కరువు
- అరకొర వసతులతోనే పరీక్షల నిర్వహణ



ఖమ్మం ఖానాపురం హవేలీ/చుంచుపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రయోగ పరీక్షలు నేడు ప్రారంభం కానున్నారు. 15 రోజుల పాటు నిర్వహించే ఈ ప్రాక్టికల్స్‌ను మొదటి షిఫ్ట్‌లో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, రెండో షిఫ్ట్‌లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5వరకు నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 89 పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మెదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్‌కు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. పర్యవేక్షణ కోసం జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా నియమించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 17వేల,457మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు 64 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 10,081 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలను నాలుగు విడతలుగా నిర్వహిస్తారు. మొదటి (మిగతా 4వ పేజీలో)

15న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వస్తుంది

- మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయండి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

వైరా, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు 15వ తేదీన షెడ్యూల్ వస్తుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వైరా మండలం విప్పలమడకలో ఆదివారం రాత్రి పర్యటించిన మంత్రికి కొంతమంది కాంగ్రెస్ నాయకులు సాదాబైనామా, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు అలాగే ఖరీఫ్‌లో మిగిలిపోయిన తమ ధాన్యాన్ని కొనుగోలు చేయించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వెంటనే కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫోన్ చేశారు. ఖరీఫ్‌లో మిగిలిపోయిన రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించారు. అదే సమయంలో పుణ్యపురం గ్రామానికి చెందిన కొంత మంది కాంగ్రెస్ నాయకులు పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా గురించి ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు. వెంటనే మంత్రి స్పందించి సాదాబైనామా పరిష్కారానికి కేవలం ఒక్కనెల గడువు మాత్రమే ఇస్తామని, అది కూడా 15న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత భూ భారతిలో ఒక నెలలో సాదాబైనామాల పరిష్కారానికి అవకాశం ఇస్తామన్నారు. ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారికి ఇప్పుడు కేటాయించబోమన్నారు. పేదలకు మాత్రమే మొదటి ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం నర్సిరెడ్డి, నాయకులు పణితి సైదులు, గుమ్మా రోశయ్య, మిట్టపల్లి నాగి, బాణోతు విజయబాయి, నంబూరి కనకదుర్గ పాల్గొన్నారు.



శివరాత్రికి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పనులు పూర్తి చేయాలి

- స్నానాల లక్ష్మీపురంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన
- తన సోదరుడు వెంకటేశ్వరరావుకు నివాళి

వైరా, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను శివరాత్రి నాటికి పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశించారు. తమ స్వగ్రామమైన స్నానాలలక్ష్మీపురంలో జరుగుతున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. రూ.3.20కోట్లతో చేపట్టిన అభిషేక మండపం, కల్యాణమండపం, కల్యాణవేదిక, కాటేజీలు, టాయ్‌లెట్స్ పనులను పరిశీలించారు. మిగిలిన పనులను శివరాత్రి నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. అంతకుముందు వైరాలోని తమ సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వరరావు తద్దినం కార్యక్రమంలో తన సతీమణి నందినితో కలిసి పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్నానాల లక్ష్మీపురంలో తమ తల్లిదండ్రులు, సోదరుల సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య పాల్గొన్నారు.

చక చకా తీగల వంతెన

- ఖమ్మం మున్నేరుపై ముమ్మరంగా సాగుతున్న పనులు
- ఆగస్టు నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక
- అంచనా రూ.180 కోట్లు
- పర్యాటక ప్రాంతంగా కాల్వొడ్డు ప్రాంతం



ఖమ్మం మున్నేరు నదిపై తీగల వంతెనకు సెగ్మెంట్లను అమర్చుతున్న దృశ్యం

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో మున్నేరు నదిపై తీగల వంతెన పనులు వేగంగా జరుగుతున్నాయి. బ్రిడ్జికి అవసరమైన పిల్లర్లు దాదాపు పూర్తయ్యాయి. వంతెనకు అవసరమైన స్లాబులను సిద్ధం చేస్తున్నారు. రూ.180 కోట్లతో రూపుదిద్దుకుంటున్న ఈ వంతెనను వచ్చే ఆగస్టు నాటికి పూర్తి చేయాలన్న ప్రణాళికతో పనులను ముమ్మరంగా చేస్తున్నారు. మున్నేరు వద్ద ఫౌండేషన్ పనులన్నీ పూర్తికావచ్చాయి. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం వద్ద మాత్రం (కాస్టింగ్‌యార్డులో) సెగ్మెంట్లు సిద్ధం చేస్తున్నారు. ఈపనులను కూడా వేగిరం చేస్తున్నారు.

వంతెన తీరు ఇలా..

ఖమ్మం రూరల్ మండలాన్ని, ఖమ్మం నగరాన్ని అనుసంధానం చేసేవిధంగా ప్రస్తుతం ఉన్న మున్నేరు పాత బ్రిడ్జి పక్కనే ఈ వంతెన నిర్మాణం ప్రారంభం అయ్యింది. 5 నెలల క్రితం పనులు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం 15 మీటర్ల ఎత్తున పాతబ్రిడ్జి ఉండగా, దాని స్థానంలో తీగల వంతెన కనీసం 17మీటర్ల ఎత్తున నిర్మిస్తున్నారు. మొత్తం 690 మీటర్ల పొడవున ఉండే ఈ వంతెనకు జలగం నగర్, ఖమ్మం వైపున ఆర్‌ఈవాల్స్‌తో అప్రోచ్ రోడ్డును 100 మీటర్ల మేర నిర్మిస్తున్నారు. ఇక 490 మీటర్ల మేర వంతెనను నిర్మించనున్నారు. 21 మీటర్ల వెడల్పులో ఫోర్‌లైన్లతో వంతెన పైభాగం ఉండనుంది. అంతే కాదు 160 సెగ్మెంట్లతో 32 మీటర్లు ఒకటి, 42 మీటర్ల పొడవుతో రెండు స్పానళ్లను సిద్ధం చేస్తున్నారు.

160 సెగ్మెంట్లకు గాను 44 పూర్తి

ఖమ్మంరూరల్ మండలం బారుగూడెం సమీపంలో కాస్టింట్ యార్డులో ఖమ్మం తీగల వంతెనకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. వంతెనకు 160 సెగ్మెంట్లు అవసరం ఉంటుంది. దీనికి ఇప్పటి వరకు 44 సెగ్మెంట్లను పూర్తి చేశారు. వంతెన మొత్తాన్ని రెండు స్పానళ్లతో సిద్ధం చేయనున్నారు. ఒకటి 32 మీటర్ల పొడవుతో మరొకటి 42 మీటర్లు ఉండనుంది.

32 మీటర్ల స్పానల్‌లో 8 సెగ్మెంట్లు, 42 మీటర్ల స్పానల్‌లో 11సెగ్మెంట్లతో వంతెనకు అవసరమైన విధంగా రూపొందిస్తున్నారు. ఇవన్నీ సిద్ధం అయ్యాక భారీ వాహనాలతో వాటిని మున్నేరు వంతెన వద్దకు తరలించి ప్రత్యేక తీగలతో వాటిని ఇక్కడ అమర్చనున్నారు. మొత్తం నాలుగు లేన్లతో మధ్యలో సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం నగరంలో శ్మశాన వాటిక ముందు నుంచి 100 మీటర్ల మేర ఆర్‌ఈ వాల్స్‌తో అప్రోచ్‌రోడ్డును నిర్మించనున్నారు. కాల్వొడ్డు సిగ్నల్స్ ప్రాంతంలో ఈ వంతెనపైకి ఎక్కేలా డిజైన్‌ను రూపొందించి పనులను చేస్తున్నారు.

పర్యాటక ప్రాంతంగా కాల్వొడ్డు

మున్నేరుకు వరదలు వచ్చి నానా అవస్థలు పడిన ప్రజలకు మున్నేరు రక్షణ గోడల నిర్మాణంతో భవిష్యత్తులో మున్నేరు వరద నుంచి ఊరట లభించనుండగా తీగల వంతెన పూర్తయితే ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా విరాజిల్లనుంది. తీగల వంతెన పూర్తయితే సెంట్రల్ లైటింగ్‌తో హైదరాబాద్ దుర్గం చెరువు వద్ద ఉన్న తీగల వంతెనలా అలరించనుంది. లైటింగ్‌తో ఈ ప్రాంతం కళకళలాడనుంది. అంతే కాదు పాతవంతెనను జలగం నగర్‌వైపు మూసేసి వంతెన ఆనవాళ్లు చెదరకుండా ప్రజలు సేద దీరేలా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. మున్నేరులోనూ బోటింగ్ ఏర్పాటు చేసి మ్యూజికల్ ఫౌంటెన్స్ ఏర్పాటు చేయనున్నారు.



సిద్ధంగా ఉన్న సెగ్మెంట్లు



ఈ నమూనాలోనే నిర్మించేది...

రాష్ట్ర పోలీసు మీట్‌లో
ఆదివాసీకి రెండు బంగారు పతకాలు

జాతీయ పోలీసు క్రీడలకు ఎంపిక

ఇల్లెందు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం బాలాజీనగర్ గ్రామ పంచాయతీకి చెందిన పేద ఆదివాసీ కుటుంబానికి చెందిన పోలీసు అధికారి వజ్జా రవికుమార్ తెలంగాణ రాష్ట్ర పోలీసు క్రీడల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. 14సంవత్సరాలుగా సాయుధ పోలీసు విభాగంలో అధికారిగా ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న రవికుమార్, హైదరాబాద్‌లోని ట్రాఫిక్ విభాగంలో అడ్మిన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కరీంనగర్‌లో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వరకు 5 రోజులుగా జరిగిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ మీట్‌లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించి హరియానాలో జరగనున్న జాతీయ పోలీస్ మీట్‌కు ఎంపికయ్యాడు. వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో స్నాచ్‌లో 60 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 80 కేజీలు మొత్తం 140 కేజీలు లిఫ్ట్ చేసి బంగారు పతకాన్ని సాధించాడు. పవర్ లిఫ్టింగ్ పోటీలో స్క్వాట్‌లో 210 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 115 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 235 కేజీలతో మొత్తం 560 కేజీలు లిఫ్ట్ చేసి మరో బంగారు పతకాన్ని సాధించాడు, రవికుమార్ గతంలో బిలాయి, పూణేలో జరిగిన జాతీయ పోలీసు క్రీడల్లో సైతం రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. ఇల్లెందు మండలానికి చెందిన వజ్జా రవికుమార్ పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించడంతో పాటు విద్యార్థిదశ నుంచి వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ దేహదారుఢ్య పోటీల్లో పాల్గొంటూ అనేక బహుమతులు పతకాలు సాధించాడు. బంగారు పతకాలు సాధించడం పట్ల ఇల్లెందుకు చెందిన పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు రవికుమార్‌ను అభినందించారు.



వజ్జా రవికుమార్



పోటీలో ప్రథమ స్థానంలో రవికుమార్

న్యాయవాదులకు
అండగా రాష్ట్ర ప్రభుత్వం

- బడ్జెట్‌లో అధికంగా నిధుల కేటాయింపు
- జిల్లాల వారీగా లీగల్ సెల్ కమిటీల ఏర్పాటు
- టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ అశోక్‌గౌడ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని, గత ప్రభుత్వంలో న్యాయవాదుల సంక్షేమానికి అరకొర నిధులు కేటాయించిందని, రానున్న రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో న్యాయవాదుల అవసరాల మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో లాయర్ మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులకు బీమా రూ.5లక్షలకు పెంచటం, బార్ కౌన్సిల్ ఇస్తున్న డెత్ బెనిఫిట్స్ రూ.10లక్షలకు, 41 సీఆర్‌పీ సవరణలు తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ చేస్తోందన్నారు. ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ సెల్ రద్దు జరిగిందని ప్రకటించారు. త్వరలోనే నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. సమావేశంలో సింగం జనార్ధన్, రావూరి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు ముస్లిం తండ్రీ తనయుల
స్వరనీరాజనం

(3వ పేజీ తరువాయి)

క్యాలెండర్‌ను దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా అందజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు రామయ్యను దర్శించుకున్నారు.

రెండోరోజు కొనసాగిన ఉత్సవాలు

భద్రాచలంలో నిర్వహిస్తున్న వాగ్గయకార ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి. బుర్లగడ్డ రవికిరణ్, చివుకుల మాధవి ఆలపించిన భక్తరామదాసు కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే డా.చింతలపాటి మంజుల, దుర్గామైత్రేయి వీణ వాయిద్యం ఆకట్టుకున్నాయి. వీరికి భద్రాచలానికి చెందిన శ్రీకాకుళం సూర్యతేజ వాయిద్య సహకారం అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన వాసా పావని వాగ్గేయకారుల్లో ప్రముఖులైన అన్నమాచార్య, త్యాగరాజ, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్, స్వాతి తిరునాళ్ మహరాజ్, భక్తజయదేవ్, భక్తరామదాసు కీర్తనలను ఆలపించారు.

రామయ్య సన్నిధిలో ఆలపించడం మహద్భాగ్యం

ఎండీ లాయక్ అహ్మద్

భక్తరామదాసు వాగ్గేయకారోత్సవాల్లో భద్రాద్రి రామయ్య సన్నిధి లో రామదాసు, త్యాగరాజస్వామి కీర్తనలతో పాటు నారాయణతీర్థ తరంగాలను ఆలపించడం ఎంతో మహద్భాగ్యం భావిస్తున్నాను. గతంలోనూ పలు మార్లు వాగ్గేయకారోత్సవాల్లో పాల్గొన్నా.. ఇప్పటి వరకు వెయ్యికిపైగా కచేరీలు చేశాను. సంగీత బోధకుడిగా 500 మందికి శిక్షణ ఇచ్చా.. తన శిష్యులు అమెరికా, యుకే తదితర దేశాల్లోనూ ఉన్నారు. తన కుమారుడు షెహబాజ్ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ తనవద్దే సంగీతంలో శిక్షణ పొంది కచేరీల్లో పాల్గొంటున్నాడు.

స్వల్పంగా తగ్గిన
పామాయిల్ గెలల ధర



అశ్వారావుపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ గెలల ధర జనవరి నెలకు గాను టన్నుకి రూ.20,487గా నిర్ణయించినట్లు ఆయిల్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. గత నెలలో ఆయిల్‌పామ్ గెలల ధర టన్ను రూ.20,506గా ఉంది. ఈనెల టన్నుకి రూ.19లు తగ్గింది. ప్రకటించిన ధర జనవరిలో సేకరించిన గెలలకు వర్తింపజేస్తారు. ఈ మేరకు అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

నేటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

(3వ పేజీ తరువాయి)

విడత 3వ తేదీ నుంచి 7వరకు, రెండో విడత 8 నుంచి 12 వరకు, మూడో విడత 13 నుంచి 17 వరకు, నాలుగో విడత 18నుంచి 22వరకు నిర్వహించనున్నారు. ప్రయోగ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం ఆన్‌లైన్‌లో చేపట్టనున్నారు. ప్రయోగ పరీక్షల ప్రశ్నాపత్రాలను అరగంట ముందుగా ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో ఉంచనుంది. తరువాత సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జ్‌ల మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేస్తారు. ఇందుకు తగ్గట్లుగా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. జిల్లా పరీక్షల కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. సీసీ కెమెరాలున్న ప్రయోగ గదుల్లో ఇంటర్‌బోర్డు నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ నుంచి తీసుకొని పరీక్షలకు హాజరుకావాలని, ఎక్కడైనా హాల్ టికెట్లు ఇవ్వని పక్షంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారులకు తెలిపాలని డీఐఈవో సూచించారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టే కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందుబాటులోలేని పరికరాలు, రసాయనాలు

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు సంబంధించి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ, ప్రవేటు జూనియర్ కళాశాలల్లోని ల్యాబ్‌లలో పరికరాలు, రసాయనాలు అందుబాటులో లేకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అసలు ప్రయోగం అంటే ఏమిటో తెలియని కొందరు విద్యార్థులు కూడా ప్రాక్టికల్స్‌లో ఎలా పాసవుతున్నారో జిల్లా ఇంటర్ అధికారులకే తెలియాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులో లేక చాలా కాలం అయినా పాత పరికరాలతో, రసాయనాలతో ఉత్తుత్తి ప్రయోగాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయోగ పరీక్షల నిర్వహణ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగాల్సి ఉండగా ఏ ఒక్క పరీక్షా కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఉన్న దఖాలాలు లేవు. పేరుకు మాత్రం పని చేయని ఓ సీసీ కెమెరాను బయట చూపించి లోపల ఏం జరుగుతుందో కేవలం ఆ పరీక్షా కేంద్రం పరిశీలకులకు మాత్రమే తెలుసు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోరన్న ఆరోపణలున్నాయి. నేటి ప్రయోగ పరీక్షలకు సంబధించి పరీక్షా కేంద్రాల వివరాలు, విద్యార్థుల వివరాలను కూడా వెల్లడించలేని స్థితిలో ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఉన్నాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై..
సానుకూలంగా స్పందించిన పొంగులేటి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జర్నలిస్టుల చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరంగా చిక్కులు లేకుండా... నిపుణుల సలహాతో ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీ రోల్ మోడల్ గా ఉండేలా చేస్తామన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం తనను కలిసి వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులతో మంత్రి చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ పూర్తయ్యాక జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి తప్పకుండా నిర్ణయం తీసుకుందామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న చిత్తశుద్ధి తో వున్నానని స్పష్టం చేసారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, సాగర్ దువ్వ, నారాయణ, నాగేశ్వర్ రావు, రామకృష్ణ, కూరాకుల గోపి, సంజీవరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కా గా ఆదివారం రాత్రి ఖమ్మంలోని మూడు జర్నలిస్టు సంఘాలు, స్థంభాద్రి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటిని కలిశారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టుల ఇళ్లస్థలాలను సత్వరమే కేటాయించాలని వినతి పత్రాన్ని అందించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, చిర్రారవి, ఫెడరేషన్ అధ్యక్షుడు కొండల్‌రావు సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు తదితరులు ఇళ్లస్థలాల సమస్య పై వివరించారు. ఖమ్మం నియోజకవర్గ జర్నలిస్టులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా స్థలాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ద్వారా దీనికి సంబంధించిన విధివిధానాలు రూపొందించేందుకు జర్నలిస్టుల ప్రతినిధి బృందంతో చర్చించనున్నట్లు తెలిపారు.

శభాష్ త్రిష

(3వ పేజీ తరువాయి)

పోషించింది. శ్రీలంకతో ఆడిన గ్రూప్ మ్యాచ్‌లో 49 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికైంది. బంగ్లాదేశ్‌తో జరిగిన పోటీలో 40 పరుగులు చేయడమే కాకుండా ఒక వికెట్ సాధించింది. స్కాట్‌ల్యాండ్‌తో జరిగిన పోటీలో 110 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచింది. బౌలింగ్‌లో మూడు వికెట్లు తీయడం విశేషం. ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో 35 పరుగులు సాధించగా సౌత్‌ఆఫ్రికతో జరిగిన మెగా ఫైనల్‌లో బౌలింగ్, బ్యాటింగ్‌లో ఆధిపత్యాన్ని చాటింది. దాంతో ఐసీసీ ఆల్‌ఆఫ్ ఫేమ్ గ్రహీత భారత మహిళల జట్టు మాజీ క్రికెటర్ నీతూ డేవిడ్ చేతుల మీదుగా త్రిష ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా త్రిష మాట్లాడుతూ ఈ అవార్డు తన తండ్రి జీవీ రామిరెడ్డికి అంకితమిస్తున్నానని ప్రకటించింది. తనను తానెప్పుడూ ఆల్ రౌండర్‌గానే భావిస్తానని, జాతీయ జట్టు తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడి మరిన్ని విజయాలు సాధించాలన్నదే తన లక్ష్యమని త్రిష వెల్లడించింది. అండర్-19 టీ20 మహిళల ప్రపంచకప్ క్రికె ట్ పోటీల్లో భారత జట్టు విజయం సాధించ డం, ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా నిలిచిన త్రిషను ఐసీసీ చైర్మన్ జైషా అభినందించారు.

అభినందించిన మంత్రులు

అండర్-19 టీ20 మహిళల ప్రపంచకప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన భద్రాచ లం యువతి గొంగడి త్రిషను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక ప్రకటన విడుదల చేశారు. భారత జట్టు జగత్ విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. ఆల్‌రౌండ్ ప్రతిభతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన భద్రాచలంకు చెందిన గొంగడి త్రిషను రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు త్రిష గర్వకారణమన్నారు. గొంగడి త్రిషను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఇంతటి ప్రతిభ గల క్రీడాకారిణి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం వాసి కావడం అభినందనీయమన్నారు. అండర్-19 టీ-20 వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుకు మంత్రి తుమ్మల అభినందనలు తెలిపారు.

భద్రాద్రి కలెక్టర్ అభినందనలు

గొంగడి త్రిష భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడా ఆణిముత్యమని ఆ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనియాడారు. అం డర్-19 ప్రపంచ కప్ మహిళ క్రికెట్ టోర్నమెంట్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మ్యా న్ ఆఫ్ ది సిరీస్ అవార్డును కైవసం చేసుకున్నందుకు త్రిషకు శుభాకాంక్షలు తెలిపారు. దేశం గర్వించే స్థాయిలో భద్రాద్రి ఖ్యాతిని ఇనుమడింపచేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కథలు.. చరిత్ర నిర్మితాలు

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కథలు చరిత్ర నిర్మితాలని, కాలానుగుణంగా వచ్చిన మార్పులను, చేర్పులను కథకులు ఎప్పటికప్పుడు తమ రచనల రూపంలో రికార్డు చేశారని అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటాచక్రపాణి పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో ఈస్థటిక్స్‌స్పేస్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'కథానియం' వార్షికోత్సవం నిర్వహించారు. దాసరి అమరేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాహిత్య సంస్థలు ఎన్నో ఉన్నా 'కథానిలయం' వలే కథలను నిక్షిప్త పరిచే మహాక్రతువు ఎక్కడాలేదన్నారు. కాళీ పట్నం రామారావు తెలుగు కథకు ఇచ్చిన బహుమానమే 'కథానిలయం' అని కొనియాడారు. వేలమంది రచయతలకు చెందిన లక్ష వరకు కథలు ఈ 'కథానిలయం'లో కొలువు తీరటం అభినందనీయమన్నారు. కథలు ఆధునిక చరిత్రకు అద్దం వంటివన్నారు. తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన కథలు, కథకుల గురించి విస్తృతగా తెలుసుకునేందుకు 'కథానిలయం' ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకొని సాహిత్యాన్ని ఆన్‌లైన్‌లో భద్రపరచటం వల్ల ప్రపంచంలో ఏమూల నుంచైనా ఈ సాహిత్యాన్ని ఉపయోగించుకునే అవకాశం కలిగిందన్నారు. కథాసాహిత్యం చరిత్రపరంగా కూడా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. పరిశోధకులు, చరిత్రకారులు కథలను ఆధారంగా తీసుకునేందుకు కథానిలయం దోహదపడుతుందన్నారు.

భిన్నత్వం తెలుగుకథా ప్రత్యేకత..

సభలో కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం మాట్లాడుతూ భిన్నత్వమే తెలుగు కథా ప్రత్యేకత అని తెలిపారు. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలకు చెందిన రచయతలు పూర్వ కాలం నుంచి నేటి వరకు తమదైన శైలిలో కథా రచనలు చేస్తున్నారని, అభివ్యక్తిలో ఎవరికి వారు ప్రత్యేకతను పాటిస్తూ సామాజిక ప్రయోజనం దిశగా కథలను మలిచారన్నారు. వస్తు, రూపం, శిల్పాలపరంగా తెలుగుసాహిత్యాన్ని ఎప్పటికప్పుడు ముందుకు తీసుకు పోతున్నారన్నారు. మహిళా కథా రచయితలు సైతం పురుషులుకు ధీటుగా కథాప్రకియలో రాణిస్తుండటంతో పాటు తమ అభివ్యక్తిని బలంగా వినిపిస్తున్నారన్నారు.

ఉన్నతి దిశగా ఖమ్మం సాహిత్య వికాసం

కార్యక్రమంలో విద్యావేత్త, కవి రవిమారుత్ మాట్లాడుతూ ఖమ్మం సాహిత్య స్థితి ఉన్నతి దిశగా పయనిస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన సాహిత్య కేంద్రంగా రూపొందుతోందన్నారు. తొలితరాలకు చెందిన పూర్వకవులు, సాహితీవేత్తల కృషి ఆదర్శంగా ఎప్పటిప్పుడు కొనసాగింపు కనిపిస్తోందన్నారు. కేవలం రచనలు చేయటమే కాక స్థానిక సాహిత్య కృషి జాతీయస్థాయిలో కవులు, రచయతలకు పురస్కారాలు ఇచ్చే స్థాయికి ఎదిగిందన్నారు.

తెలంగాణ కథపై విస్తృత చర్చ..

కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన నిర్వహించిన ప్యానల్ డిస్కషన్‌లో తెలంగాణ సాహిత్యంపై విస్తృత చర్చ నిర్వహించారు. తెలంగాణ కథ సమాజ కేంద్రం, వ్యక్తికేంద్రకం, పరిణామం అనే అంశాలపై సంగిశెట్టి శ్రీనివాస్, కేపీ. అశోక్‌కుమార్, తిరునగరి దేవకిదేవి పాల్గొని విస్తృతంగా చర్చించారు. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ కథ తీరుతెన్ను, అంతిమ ధ్యేయం, అనుసరించాల్సిన చర్యలు వంటి వాటిపై ప్రసేన్ ప్రశ్నలు సంధించి వాటికి వక్తలనుంచి జవాబులు రాబట్టారు. కార్యక్రమంలో భాగంగా నిమ్మగడ్డ శేషగిరిరావు, దాసరి అమరేంద్ర రచించిన 'మనమెరుగని లాటిన్ అమెరికా' అనే పుస్తకాన్ని, ప్రముఖ కథా రచయిత వంశీకృష్ణ రచించిన 'గోధుమ రంగు ఊహ' కథల పుస్తకాన్ని వేదికపై ఆవిష్కరించారు. లాటిన్ అమెరికా పుస్తకాన్ని ముళ్లపూడి సుబ్బారావు, గోధుమ రంగు ఊహ పుస్తకాన్ని తోట సుభాషిణి పరిచయం చేశారు. ఖమ్మం సాహిత్య వికాసం అనే అంశంపై విద్యావేత్త, కవి రవి మారుత్ మాట్లాడారు. దాసరి రామచంద్రరావు నివేదికను ప్రవేశపెట్టారు.

భక్తులతో కోలాహలంగా
అమ్మవారి ఆలయాలు



ఆలయంలో భక్తులు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయకపురంలో గల ప్రసిద్ధ ఆలయం చిలకలగండి ముత్యాలమ్మ, గోగులపుడి సమీపంలో గల గుబ్బల మంగమ్మ ఆలయాలు ఆదివారం భక్తులతో కోలాహలంగా మారాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ పరిసరాలు సందడి సందడిగా మారాయి. వినాయకపురం ఆలయం వద్ద అశ్వారావుపేట, కుక్కునూరు మండలాలకు చెందిన అనేకమంది మొక్కులు చెల్లించే కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక గుబ్బల మంగమ్మ ఆలయానికి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు, ఆలయ కమిటీలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వివాదం

కారేపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లి ఆశ్రమపాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య జరుగుతున్న వర్గపోరుతోపాటు డిప్యూటీ వార్డెన్ ఆత్మహత్యయత్నంపై ఆదివారం ఎస్ఐ ఎస్.రాజారాం పాఠశాలలో విచారణ చేపట్టారు. డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లు, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల మధ్య గత కొంతకాలంగా వర్గపోరు సాగుతోంది. డిప్యూటీ వార్డెన్ వెంకటేశ్వర్లు విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తింస్తున్నాడని, లైంగికంగా వేధిస్తున్నాడని, కొంతమంది విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సునావత్ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదుచేశారు. విద్యార్థుల ఫిర్యాదుమేరకు హెచ్ఎం ఐటీడీఏ అధికారులకు సమాచారం అందించారు. విషయంపై ఏటీడీవో జహిరుద్దీన్ విచారణ చేసి డిప్యూటీ వార్డెన్‌ది తప్పుగా తెలియడం పాటు సస్పెన్షన్ ఆర్డర్ జారీ చేశారు. ఇదే విషయాన్ని శనివారం డిప్యూటీ వార్డెన్ వెంకటేశ్వర్లకు చెప్పేందుకు ఆయన గదిలోకి వెళ్లిన హెచ్ఎం శ్రీనివాస్‌రావును చూసిన వెంకటేశ్వర్లు గదిలో ఉన్న పలు రకాల మందు బిళ్లలను మింగి ఆత్మహత్యాయుత్నానికి ప్రయత్నించాడు. ఇదిగమనించిన తోటి ఉపాధ్యాయులు వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఇదేవిషయంపై ఎస్ఐ రాజారాం విచారణ జరిపినట్లు తెలిపారు.

పది రోజులుగా పాఠశాల మూత

బదిలీ అయిన ఇద్దరు ఉపాధ్యాయులు

వారి స్థానాల్లో లేని నియామకం

విద్యార్థుల చదువుపై విద్యాశాఖ చిన్నచూపు

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లోని గిరిజన విద్యార్థుల చదవుపై జిల్లా విద్యాశాఖ చిన్నచూపు చూస్తోంది అనడానికి నిదర్శనంగా అడవిరామవరం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల నిలుస్తోంది. ఆళ్లపల్లి మండలం, అడవిరామవరం మండల పరిషత్ పాఠశాలలో ఒకటి నుంచి 5



ఆరుబయట ఆడుకుంటున్న విద్యార్థులు

తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో 16 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పది రోజులకు పైగా ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలను మూసేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో ప్రత్యామ్నాయం చూపాల్సిన విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. పాఠశాలలో గతంలో ఒక ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు (ఇద్దరు) అక్కడి గిరిజన, వలస ఆదివాసీ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. ఈ నేపథ్యంలో ఇటీవలే ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు 317 జీవో కింద బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో విద్యాశాఖ మరో ఉపాధ్యాయులు కేటాయించకపోవడంతో జనవరి 20 నుంచి పాఠశాలకు ఏ ఉపాధ్యాయుడు హాజరుకాలేదు. అడవిరామవరం పాఠశాలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించకపోగా, కనీసం మండల, కాంప్లెక్స్ పరిధిలో తాత్కలికంగానైన మరో ఉపాధ్యాయున్ని ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు రోడ్లపై, చెట్ల క్రింద ఆటలు ఆడుకుంటు చదువులకు దూరమవుతున్నారు. అడవిరామవరం మారుమూల గిరిజన ప్రాంతం, నిరక్ష్యరాసులైన ఇక్కడి గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల చదువుల పై ఏం అడుగుతారు.. ఏమనుకున్నారేమో.. కాని పాఠ



అడవి రామవరం పాఠశాల

శాలకు పదిరోజుగా ఉపాధ్యాయులను నియమించకపోవడంతో విద్యార్థుల చదువు ఆగంగా మారింది. జిల్లా విద్యాశాఖ, ఐటీడీఏ అధికారులు గిరిజన ప్రాంతమైన అడవి రామవరం పాఠశాల ఉపాధ్యాయుల నియమకంపై దృష్టి పెట్టి విద్యార్థులకు చదువులు వచ్చేలా చూడాలని అడవిరామవరం పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయపై డీఈవోని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎంఈవో ద్వారా రిపోర్టు తీసుకుని ఏర్పాటు చేస్తాం అన్నారు. ఇదిలావుండగా ఇప్పటికైనా అధికారులు స్పందించి, పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ చెల్లింపుల దిశగా..

మహిళా సంఘాలు

స్త్రీ నిధి నుంచి ఉచితంగా పాయింట్ ఆఫ్ సేల్ మిషన్లు

ఇరు జిల్లాల్లో 239 మందికి పీవోఎస్ పరికరాలు

సత్వర నగదు లావాదేవీలు, పారదర్శకతే లక్ష్యం

మహిళలకు తప్పనున్న బ్యాంకుల వద్ద పడిగాపులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు నగదు రూపంలో లావాదేవీలు జరిపిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఇక మీదట డిజిటల్ చెల్లింపుల దిశగా అడుగులు పడుతున్నాయి. మహిళా సంఘాల నిర్వాహణతో పాటుగా పారదర్శికత, సమయం ఆదా, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసే ఇబ్బందులు తొలగనున్నాయి. పట్టణాల నుంచి పల్లెల వరకు మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లింపుల సమయంలో దుర్వినియోగానికి అడ్డుకట్టపడనుంది. డబ్బులు చెల్లించిన మహిళలకు వెనువెంటనే వారి సెల్‌ఫోన్‌లకు చెల్లింపుల వివరాలు సమాచారం రానుంది. ఈ మేరకు మెప్మా పరిధిలో రిసోర్స్ పర్సన్‌లకు, గ్రామీణాభివృద్ధిశాఖలోని సెర్ప్ గ్రామ దీపికలకు పాయింట్ ఆప్ సేల్ మిషన్లను స్త్రీ నిధి నుంచి ఉచితంగా అందించారు.



మిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రూ.5లక్షల వరకు స్త్రీ నిధి రుణాలు

పది మంది మహిళలు కలిసి ఒక మహిళా స్వయం సహాయక సంఘం(ఒక ఎస్‌హెచ్‌జీ)గా ఏర్పడతారు. ఆరు నెలల కాలం గడిచిన తర్వాత మహిళా స్వయం సహాయక సంఘం రూ.14,400 పొదుపు చేయటం ద్వారా శ్రీనిధి రుణాలను పొందేందుకు అర్హత ఏర్పాడుతుంది. ఒక్కో మహిళ సభ్యురాలు రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు రుణాలను తీసుకునేందుకు అవకాశం ఉంది. 11శాతం వడ్డితో రుణాలను మంజూరు జరుగుతాయి. సువిధ రూ.50వేలు, ప్రగతి రూ.లక్ష, అక్షయ రూ.2లక్షలు, సౌభాగ్య రూ.3లక్షలు, ఐశ్వర్య రూ.5లక్షల రుణాలను పొందుతారు. సువిధకు 24నెలలు, ప్రగతికి 48 నెలలు, మిగిలిన అక్షయ, సౌభాగ్య, ఐశ్వర్య స్కీంలకు 60నెలల కాలపరిమితితో స్త్రీ నిధి రుణాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రుణం తీసుకున్న సభ్యురాలు మరణిస్తే ఇన్స్‌రెన్స్ కోసం చెల్లించిన ప్రీమియం డబ్బులు నామినికి అందుతాయి. సభ్యురాలు చెల్లించాల్సిన బకాయిలు మాఫీ జరుగుతాయి.

పారదర్శక చెల్లింపుల కోసం..

శ్రీనిధి రుణాలను మెప్మా పరిధిలో ఆర్పీలు, సెర్ప్ పరిధిలో గ్రామదీపికలు మహిళ స్వయం సహాయక సంఘాల నుంచి రికవరీ చేసి శ్రీనిధి బ్యాంకు ఖాతాలకు జమ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సంఘాల నుంచి డబ్బులు వసూళ్ల చేయటం, కొన్ని రోజులు వారి వద్దనే డబ్బులు నిల్వ ఉంచుకోవటం తర్వాత బ్యాంకుకు వెళ్లి డబ్బులు చెల్లించటంతో స్త్రీనిధి రుణాలు చెల్లింపులో జాప్యం జరుగుతుంది. దీంతో పాటుగా సభ్యులు చెల్లించిన రుణాలు కొంతమంది ఆర్పీలు, గ్రామదీపికలు సొంత ఆర్థిక అవసరాలకు వాడుకోవటంతో స్త్రీనిధి రుణాలు రికవరి ఇబ్బందులు ఎదురైతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 239 మందికి..

శ్రీనిధి రుణాలు ఇవ్వటం నుంచి తిరిగి రికవరీ వరకు ఆర్పీలు, గ్రామదీపికల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. మహిళా సభ్యులకు శ్రీనిధికి మధ్యలో సంధానకర్తలుగా వీరే ఆర్థికలావాదేవీలను నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే మహిళా స్వయం సహాయక సంఘాలను డిజిటల్ చెల్లింపులు దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు, మంచిగా పనిచేసే ఆర్పీలు, గ్రామ దీపికలను ప్రోత్సహించేందుకు శ్రీనిధి సంస్థ ముందుకు వచ్చింది. శ్రీనిధిలో నూరుశాతం రికవరీలు చేసిన ఆర్పీలు, గ్రామదీపకలకు ఒక్కో పీవోఎస్ మిషన్‌ను రూ.16వేలకు కొనుగోలు చేసి ఆర్పీలు, గ్రామదీపికలకు పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 239 పీవోఎస్ మిషన్లు పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లాలో 30 మంది ఆర్పీలు, 140 మంది గ్రామదీపికలకు, భద్రాద్రి కొత్తగూడెంలో ఇద్దరు ఆర్పీలు, 67 మంది గ్రామదీపికలకు పంపిణీ చేశారు. పీవోఎస్ మిషన్లు ద్వా రా మహిళలు తీసుకున్న శ్రీనిధి రుణాలను వారి ఇంటి నుంచే నేరుగా చెల్లింపులు చేయటం ద్వారా పారదర్శికత, సమయం ఆదా, బ్యాంకు చుట్టూ తి రిగే ఇబ్బందులు తొలగనున్నాయి.

సిలబస్ పూర్తిగా చదవాలి

ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయలక్ష్మి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ప్రణాళికా ప్రకారం సిలబస్ పూర్తిగా చదవాల ని ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయలక్ష్మీ అన్నారు. ఆదివారం స్థానిక గిరిజన సంక్షేమ వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోటివేషన్ క్లాస్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వక్త డాక్టర్ కొచ్చర్ల శ్రీ నివాసరావు మాట్లాడుతూ చదువు పట్ల ఏకాగ్రతను కలిగి హార్డ్‌వర్క్‌తో పాటు స్మార్ట్‌వర్క్ చేయాలని, పరీక్షా హాల్‌లో తగిన జాగ్రత్తలు తీసుకుంటే వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. తల్లిదండ్రులు, గురువులు, విద్యాలయం పేరు ప్రతిష్ఠలు, ప్రగతి, మీ భవిష్యత్ అంతా మీ క్రమశిక్షణపై, మీ లక్ష్యసాధనపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ప్రశాతంగా, స్వేచ్ఛగా పరీక్షలు రాయడానికి సిద్ధపడాలని, ఇప్పటివరకు చదివింది మొత్తం రివిజన్ చేసుకోవాలని, రై టింగ్ ప్రాక్టీస్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డెన్ రాములు, గెజిటెడ్ హెచ్ఎం యాకూబ్, డాక్టర్ రామదాసు, రాజు, మాధవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే వారిలో అధికంగా..

'ఓపెన్' విద్యార్థులే: చక్రపాణి

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే వారిలో అధికంగా డాక్టర్ బీఆర్ అబేంద్కర్ ఓపెన్ యూనిర్శిటి విద్యార్థులే ఉన్నారని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని సందర్శించారు. తెంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ మంది చదువుతున్న అధ్యయన కేంద్రాలలో ఖమ్మం మూడవ అతి పెద్ద ప్రాంతీయ కేంద్రమన్నారు. రెగ్యులర్ విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో లేని కోర్సులు ఓపెన్ యునిర్శిటిల లో అందుబాటులో ఉన్నాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫీజు రాయితీలు కల్పించబోతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యాభ్యాసం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటి స్టూడెంట్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా, డాక్టర్ సీతారాం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చక్రపాణి

టీజేఎస్ జిల్లా కన్వీనర్‌గా వర్దబోయిన బాబు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి ఖమ్మం జిల్లా కన్వీనర్‌గా వరదబోయిన బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన టీజేఎస్ జిల్లా ప్లీనరీలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల స్థలం, పించన్, సంక్షేమబోర్డును ఏర్పాటుచేయాలన్నారు. పార్టీ నిర్మాణం కోసం వివిధ మండలాల్లో కమిటీలు వేయాలని తీర్మానించారు. ఈకార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, బాస్కరరావు, నాగేంద్రరావు, గిద్దగిరి సత్యనారాయణ, వాసు, జగదీష్, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తిరుమలాయపాలెం ఫ్రిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. మండలంలోని ఇస్లావత్ తండాకు చెందిన ఇస్లావత్ ప్రసాద్(17) కూలి పనిచేస్తున్నాడు.ఇతను మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు గత నెల 29న తన జీవితంపై విరక్తిచెంది పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గాండ్లగూడెం గ్రామశివారులో గల చెరువు వద్ద కొందరు పేకాట ఆడుతున్నారు. సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.6200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట, జూదం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ యయాతి రాజు కోరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రగడ

బీఆర్ఎస్ శ్రేణులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అరెస్టు

వేంసూరు పోలీస్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

సత్తుపల్లి స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల నినాదాలు

ఇరు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు

సత్తుపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో కొంత కాలంగా స్తబ్ధుగా ఉన్న రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఆదివారం పోలీసులు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయటంతో ఇరు పార్టీల నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తారా స్థాయికి చేరుకున్నాయి. అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేంసూరు పోలీస్టేషన్‌కు, కాంగ్రెస్ కార్యకర్తలకు మద్దతుగా డాక్టర్ మట్టా దయానంద్ సత్తుపల్లి పోలీస్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో సత్తుపల్లిలో రెండు పార్టీల మధ్య మాటల తూటాలు పేలి వాతావరణం వేడెక్కింది.

అసలు ఏమి జరిగిందంటే..

సత్తుపల్లి మునిసిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియటంతో గత నెల 31న తాజా మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులకు జరిగిన అభినందన సభలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపైనా, సత్తుపల్లి నియోజకవర్గంలో అక్రమాలు జరుగుతున్నాయంటూ, ఇక్కడ డీ ట్యాక్స్ అమలవుతోందంటూ ఆరోపణలు చేసారు. దీనిపై శనివారం కాంగ్రెస్ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వెంకటవీరయ్య హయాంలో అవినీతి అక్రమాలు చట్టబద్దం చేసారని, అప్పట్లో ఇక్కడ క్రికెట్ బుకీలు, పేకాట నిర్వాహకులు రాజ్యమేలారని ప్రత్యారోపణలు చేసారు. సండ్ర చేసిన ఆరోపణలపై బహిరంగంగా సమాధానమిస్తామని అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని సవాలు విసిరారు.

కాంగ్రెస్ సవాలుతో అరెస్టులు..

సండ్ర చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని అంబేద్కర్ విగ్రహం వద్దకు చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులు సవాలు విసరటంతో పోలీసులు అలెర్టయ్యారు. కాంగ్రెస్ సవాలుకు బీఆర్ఎస్ నాయకులు ఎవరూ స్పందించలేదు. అయినా సత్తుపల్లి పోలీసులు రంగంలోకి దిగి ఆదివారం ఉదయం నుంచి బీఆర్ఎస్ నాయకుల ఇళ్లకు వెళ్లి ముందస్తు అరెస్టులు చేసి సత్తుపల్లి స్టేషన్‌కు తరలించారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించినా కారణంగా చెప్పకుండా తమని అరెస్టు చేసి వేంసూరు పోలీస్టేషన్‌కు తరలించారని తెలిపారు. కాంగ్రెస్ సవాలును తాము పట్టిచుకోకపోయినా కేవలం అధికార పార్టీ నాయకుడి ఆదేశంతో అక్రమంగా అరెస్టు చేసారని ఆరోపించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులను కూడా ముందస్తు అరెస్టు చేసి సత్తుపల్లి పోలీస్టేషన్లకు తరలించారు. వివాదానికి కారణమైన వెంకటవీరయ్యను అరెస్టు చేయాలని పోలీస్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేసారు.

ఇరు పార్టీల ధర్నాలు..

ముందస్తు అరెస్టులతో కాంగ్రెస్ నాయకులు సత్తుపల్లి పోలీస్టేషన్‌లో ధర్నా నిర్వహించి నినాదాలు చేసారు. వేంసూరు పోలీస్టేషన్‌లో నేలపై కూర్చొని బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అధికార పార్టీ ఆదేశాలతో పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారని నినాదాలు చేసారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే సండ్ర, వేంసూరు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేంసూరు పోలీస్టేషన్‌కు చేరుకొని మద్దతు పలికారు. సత్తుపల్లి పోలీస్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మద్దతు పలికారు.

కాంగ్రెస్‌లో భిన్నస్వరాలు..

ఆదివారం సత్తుపల్లిలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేయటం, ఆ తరువాత కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన సంఘటనలపై అధికార పార్టీలోని కొందరు నాయకులు భిన్న వ్యాఖ్యానాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, అయినా సవాలుకు స్పందించి ఇరు వర్గాలు రోడ్డెక్కినప్పుడు మాత్రమే ముందస్తు అరెస్టులు చేస్తే అందరూ సానుకూలంగా స్పందించే అవకాశం ఉండేదని అన్నట్లు చెపుతున్నారు.

ఈ రకమైన అరెస్టుల వల్ల అధికార పార్టీకి వచ్చిన మైలేజి ఏమిటని ఆ పార్టీలోనే చర్చకు తెరలేచింది. ఆదివారం సంఘటన బీఆర్ఎస్ కేడర్‌లో ఐక్యత పెంచినట్లయిందని కాంగ్రెస్‌లో మరి కొందరు వాదిస్తున్నారు. ఇదంతా ఒక భాగం అయితే సత్తుపల్లిలో ఒక మంత్రి అనుచరులను అరెస్టు చేసి, మ రో మంత్రి అనుచరులను ముందస్తు అరెస్టు చేయలేదని ప్రచారం జరుగుతోంది. దీని వెనుక కారణం కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



వేంసూరు పోలీస్ స్టేషన్‌లో సండ్ర, కార్యకర్తలు



సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో దయానంద్, కాంగ్రెస్ కార్యకర్తలు

క్రైం సమాచారం

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వాపురం ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మొండికుంట గ్రామానికి చెందిన చాతర్ల వెంకన్న (60) సైకిల్‌పై యూనియన్ బ్యాంకు సమీపంలో ప్రధాన రహదారి దాటుతుండగా కొత్తగూడెం నుంచి మణుగూరు వెళ్తున్న కారు అతివేగంతో వెంకన్న సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో సైకిల్‌పై నుంచి ఎగిరి కారుమీదనుంచి రహదారిపై పడటంతో వెంకన్న తలకు తీవ్ర గాయమయ్యింది. స్థానికులు అతనిని 108 అంబులెన్సు ద్వారా చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించటంతో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా వెంకన్న దంపతులు మొండికుంట గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. కొత్తగూడెంలోని తన బంధువు చనిపోవటంతో అతనిని చూసేందుకు గ్రామంలోని మిగతా బంధువులకు కబురు చెప్పేందుకు వెళ్తున్న వెంకన్న ఇంట్లోనుంచి బయలు దేరిన ఐదు నిమిషాల్లోనే మృతి చెందటం గ్రామంలో విషాదం నింపింది. అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

మణుగూరులో వ్యక్తి దుర్మరణం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని పట్టణ ప్రధాన రహదారి 100 పడకల ఆసుపత్రి ఎదురుగా లారీకి ఢీ కొన్న సంఘటనలో కాళీ మాత ఏరియాకు చెందిన రావుల పల్లి ప్రదీప్(29) అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు నుంచి లారీ బొగ్గును లోడ్ చేసుకుని కొత్తగూడెం వైపుకు వెలుతోంది. వెనుక నుంచి ద్విచక్రవాహనం పై కాళీమాత ఏరియా ప్రాంతంలో నివాసముండే రావులపల్లి ప్రదీప్ అతని మిత్రుడు లారీని ఓవర్ టేక్ చేయబోగా ఎదురుగా మరో వాహనం వచ్చింది. దీంతో వాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ప్రదీప్ లారీ వెనుక చక్రాల కిందపడి దుర్మరణం పాలయ్యాడు. అతని మిత్రుడు పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపారు.

పాల్వంచలో పట్టపగలు చోరీ

పాల్వంచ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాల్వంచలో పట్టపగలు జరిగిన చోరీ ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరిగూడెంకు చెందిన వడ్లమూడి పూర్ణచంద్రరావు తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఫంక్షన్‌కు వెళ్లడానికి సిద్ధపడ్డాడు. ఈ క్రమంలో తాను బ్యాంకు లాకర్‌లో భద్రపరచిన బంగారాన్ని తీసుకోవడానికి మార్కెట్‌లోని బ్యాంకుకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత లాకర్ నుంచి బంగారాన్ని తీసుకున్న అతను తనకున్న స్కూటీలోని డిక్కీలో భద్రపరిచాడు. అనంతరం అదే మార్కెట్‌లోని ఓ టీ స్టాల్ వద్ద తన ద్విచక్రవాహనం పెట్టి తన స్నేహితుడితో మాట్లాడాడు. అక్కడ నుంచి నేరుగా ఓ మందుల షాపుకు వెళ్లి మందులు తీసుకుని డిక్కీ తెరిచి చూడగా అందులో భద్రపరిచిన బంగారు ఆభరణాల బాక్స్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికి పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఇద్దరు అగంతకులు బ్యాంకు నుంచే పూర్ణచంద్రరావును ఫాలో అవుతూ టీ స్టాల్ వద్దకు రావడం, డిక్కీలోని బాక్స్‌ను తస్కరించిన దృశ్యాలు సమీపంలోని ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. ఈ వీడియాలు కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా బాధితుడు చెబుతున్న లెక్కల ప్రకారం బంగారు ఆభరణాల విలువ రూ.2.50 లక్షల పై చిలుకు ఉంటుంది.

ముగ్గురు వలస కూలీలకు గాయాలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిరాంతండా గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురు వలస కూలీలకు గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుమారు 15 మంది వలస కూలీలు మిర్చి కోతల పనులను చేపట్టేందుకు ఆటోలో కొత్తగూడెం నుంచి జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో సాయిరాంతండా గ్రామ సమీపంలో జూలూరుపాడు నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వలస కూలీ చంద్రాకూడతో పాటు మరో ఇద్దరు వలస కూలీలకు గాయాలయ్యాయి. 108లో వారిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స అందించేందుకు తరలించారు. సం ఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ చదువుతున్న బాలిక అదృశ్యంపై బూర్గంపాడు పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. బూర్గంపాడు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శనివారం తన బంధువులు వచ్చారని కళాశాల నుంచి అనుమతి తీసుకొని బయటకు వెళ్లింది. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో కళాశాలలో అనుమతి తీసుకొని బాలికనను తీసుకెళ్లిన బంధువులకు కళాశాల సిబ్బంది ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చినట్లు తెలిపారు. సదరు బాలిక తిరిగి కళాశాలకు రాకపోవడంతో కళాశాల ప్రత్యేక అధికారి సుశీల ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

టేకు కలప పట్టివేత

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్ర జ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన టేకు కలప స్థావరాలపై ఆదివారం అటవీశాఖ అధికారులు దాడులు చేసి పట్టుకున్న సం ఘటన ఆళ్లపల్లి మండలంలో జరిగింది. అటవీశాఖ అధికారుల వివరాల ప్రకారం కాచనపల్లి రేంజి ఎఫ్ఆర్‌వో చలపతిరావు ఆదేశాల మేరకు రేంజ్ పరిధిలోని కర్నెగూడెం సెక్షన్, లొద్దిగూడెం గ్రామ శివారులో అక్రమంగా టేకుకలప నిల్వ చేసి తరలించేందుకు సిద్దంగా ఉందన్న సమాచారం మేరకు ఎఫ్ఎస్‌వో టి.వెంకన్న సమక్షంలో సిబ్బంది లక్ష్మణ్, వీరేందర్, నరేష్, జితేందర్ ఆయా స్థావరాలపై దాడులు చేసి సుమారుగా రూ.60 వేలు విలువ చేసే టేకు కలపను పట్టుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.





వివాహానికి హాజరైన మంత్రి తుమ్మల



ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మంలోని పలుప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు వేజళ్ల సురేష్ కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మేయర్ పునుకొల్లు నీరజ వెంట ఉన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	44
పచ్చిమిర్చి	36
బెండకాయ	38
బెండకాయ	38
పొట్లకాయ	28
దోసకాయ	28-44
చిక్కుడు	58
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	20
దొండ	38-44
సొరకాయ	18
క్యారెట్	24
క్యాప్సికం	48
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	155
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

పదిరోజుల్లో రూ.2.65కోట్లు మంజూరు చేయిస్తా

» భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా రామదాసు జన్మస్థలాన్ని అభివృద్ధి చేస్తాం

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



రామదాసు విగ్రహానికి పూజలు చేసిన మంత్రి పొంగులేటి, మువ్వా

నేలకొండపల్లి,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ధ్యానమందిర అభివృద్ధికి పదిరోజుల్లో రూ.2.65కోట్ల నిధులు మంజూరు చేయిస్తానన్నారు. భక్త రామదాసు నడయాడిన ప్రాంతాన్ని తరతరాలుగా గుర్తుపెట్టుకునేలా అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేయిస్తానని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. భక్త రామదాసు జయంత్యుత్సవాల రెండోరోజైన ఆదివారం నేలకొండపలిలోని ధ్యానమందిర ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ధ్యానమందిరంలో అర్చకుడు సౌమిత్రి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పొంగులేటి ధ్యాన మందిరంలోని రామదాసు విగ్రహానికి పూల మాలేసి పూజలు చేశారు. అనంతరం ఆడిటోరియంలో విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ రామదాసు పుట్టిన నేలకొండపల్లిలో ప్రతీసంవత్సరం జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఆడిటోరియాన్ని గత సంవత్సరం తానే ప్రారంభించినట్లు తెలిపారు. జయంత్యుత్సవాల్లో ఇంతపెద్దఎత్తున పాల్గొన్న భక్తులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఎన్నో అవమానాలు, కష్టాలు, ఎదుర్కొని భక్తరామదాసు భద్రాచలంలో అద్భుతమైన దేవస్థానానికి నిర్మించి ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. సభానంతరం మంత్రిని నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మువ్వా విజయ్‌బాబు,కమిటీ సభ్యులు మన్నె కోటేశ్వరరావు, నంచర్ల దేవీప్రసాద్, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, వాసం లక్ష్మయ్య నాయకులు నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, రాయపూడి నవీన్, వేగినాటి లక్ష్మీనర్సయ్య, బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, వజ్జా రమ్య, దోసపాటి కల్పన, షైసా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కార్యక్రమాలు



నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యానమందిరంలోని ఆడిటోరియంలో జరుగుతున్న భక్తరామదాసు జయంత్యుత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం కళాకారులు నిర్వహించిన కార్యక్రమాలు, రామదాసు కీర్తనల గానం ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం కోదండరాయమ్మ, విజయవాడ వారు నిర్వహించిన సంగీత కార్యక్రమం అలరించింది. అనంతరం స్వరలహరి కల్చరల్ అకాడమీ, మహబూబ్‌నగర్ కళాకారులు చేసిన సంగీత సభ ఉర్రూతగించింది. ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటినుంచి కుసుమహరినాథ బాబా కల్యాణ వేడుకలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండల కొలువుదీరిన శ్రీకుసుమ హరినాథబాబా కల్యాణమహోత్సవం ఈనెల3,4,5తేదీల్లో జరగనున్నాయి. నేడు ఏకనామ సంకీర్తనలు ప్రారంభం, 4న కుసుమహరినాథబాబా కల్యాణం, 5న స్వామివారి పవళింపు సేవ జరుగుతుందని ప్రధాన అర్చకలు బుర్రా సీతారామాచార్యులు తెలిపారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నేలకొండపల్లి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాయగూడెం శివారులో ఆదివారం శ్రీచిట్టి ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం యంత్ర స్థాపన, విగ్రహస్థాపన, జీవధ్వజ స్థాపన వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుపుకోవట శుభకరమన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న కోనాయగూడెం, ఆరెగూడెం గ్రామాల ప్రజలను మంత్రి అభినందనలు తెలిపారు.అర్చకుడు ఇంగువ రామకృష్ణ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి నాయకులు కొడాలి గోవిందరావు,శాఖమూరి రమేష్, జంగం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే

మాజీ మంత్రి పువ్వాడ



ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కారానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పోరాటాలు చేయాల్సిందే అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలో బీఆర్‌ఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రజాపాలన బాగుందా, ఫామ్ హౌస్ పాలన బాగుందా అని ప్రజా తీర్పు కోరితే.. వారికే ఎదురుదెబ్బ తాకిందని యద్దేవా చేశారు. ఇప్పటికి ప్రజల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి ఉందని, ప్రతి కార్యకర్త చేతిలో పింకు డైరీ పట్టుకొని ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఏడాది పరిపాలనలో కేసీఆర్ కుటుంబాన్ని తిట్టటానికే పెట్టుకున్నారని, ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయలేదని ఆరోపించారు. రైతులు, మహిళలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రుణమాఫీ అమలు కాకపోగా మిర్చి, పత్తి పంటలకు కనీస మద్దతు ధర లేక పోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం ఏలా ఉంది.. ఇప్పుడు ఏలా ఉందని ప్రశ్నించారు. కార్యకర్తలకు ఎప్పుడు అండగా తాను ఉంటానన్నారు. నగర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మక్బూల్, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	మదగజరాజు
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	రాచరికం
కేపీఎస్:	రిథమ్‌ఆఫ్‌లవ్/ ప్రేమిస్తావా
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణ

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370

సీసీ కెమెరాల ఏర్పాటు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అజ్మీరతండాలో ఆదివారం సోలార్ సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ జగదీష్ ఆదేశాలతో గ్రామపంచాయతీ పరిధిలోనిజంక్షన్ వద్ద వీటిని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి, కాంగ్రెస్ నాయకులు బత్తుల రమేష్, గుగులోత్ మోహన్, దేశ్యానాగుల్‌మీరా, అజ్మీరా మోహన్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రతీ విద్యార్థికి పదోతరగతి గీటురాయి

» డీడీ కస్తాల సత్యనారాయణ



మాట్లాడుతున్న డీడీ కస్తాల

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి పదోతరగతి పరీక్షలు జీవితానికి గీటురాయిగా మారతాయని, ఉన్నతస్థాయి విద్యలోకి వెళ్లాలంటే పదోతరగతి పరీక్షల నుంచే శ్రద్ధతో విద్యాభ్యాసం చేయాలని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పేర్కొన్నారు.ఆదివారం ఖమ్మంలో ఎస్సీసంక్షేమ వసతిగృహంలో విద్యాభ్యాసం చేస్తున్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, భవిష్యత్ కార్యచరణ ప్రత్యేక శిక్షణ తరగతులు తీసుకున్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజల్వన చేసి శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఎస్సీ వసతిగృహాల్లో విద్యాభ్యాసం చేసి ఐఏఎస్, ఐపీఎస్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఎదిగిన వారిని వివరించారు. మట్టిలో పుట్టిన మాణిక్యాలు ఎందరో రాష్ట్ర,జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందారని వివరించారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమాధికారులు రవూఫ్, కొటపాటి రుక్మారావు, ఝాన్సీరాణి, మురహరి, విజయ, వినదా, స్టాలిన్, మల్లారెడ్డి, ఎస్ వెంకటరెడ్డి, సత్తార్, కోమలి, అఫ్రషన్నిషా, వరలక్ష్మీ, శ్రీనివాస్, నాగరాజు, శ్రీధర్, వోదేలు, బాలకృష్ణ పాల్గొన్నారు.

గంగపుత్రులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

» కార్పొరేటర్ పాలేపు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): గంగపుత్రులకు కాంగ్రెస్ ప్రభుత్వం కొండంత అండగా ఉంటుందని,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లాలోని గంగపుత్రుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తున్నారని ఖమ్మం 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం సమీపంలోని మామిడితోటలో వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గంగపుత్రులతో కలిసి పాలేపు విజయ వెంకటరమణ కలిసి ఆడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమవయ్య,గౌరవఅధ్యక్షుడు శంకరయ్య, కార్యదర్శి సుదర్శన్,నాయకులు గుంటి కుమార్, దుర్గేందర్, పెద్దపెల్లి సుధాకర్, పిల్లి మల్లయ్య, పాకాల ఉపేందర్ పాల్గొన్నారు.



విజయ వెంకటరమణను సన్మానిస్తున్న గంగపుత్రుల సంఘం నాయకులు

'కలికితురాయి' కవిత్వ సంపుటి ఆవిష్కరణ

ఖమ్మంసాంస్కృతికం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): కవులు సమాజ శ్రేయస్సును కాంక్షించాలని ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు అన్నారు. గరిడేపల్లి శోభనాద్రి రచించిన కలికి తురాయి కవిత్వ సంపుటి ఆవిష్కరణ ఆదివారం వీడీవోస్ కాలనీలోని సర్వజ్ఞ స్కూల్‌లో జరిగింది.. జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ కవిత్వం పీడితులు, బాధితుల పక్షం వహించాలన్నారు. పీడితుల కష్టాలు, కన్నీళ్లను తుడిచే విధంగా వారి సమస్యలను పరిష్కరించే విధంగా రచనలు సాగించాలన్నారు. సామాజిక ప్రయోజనం కల రచనలు కలకాలం నిలిచి ఉంటాయన్నారు. కార్యక్రమంలో జాషువా సాహిత్య వేదిక బాధ్యులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, నామారామారావు, యలమందల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రేపు పదోతరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్టు

ఖమ్మంమార్కెట్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు మంగళవారం టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గిరిప్రసాద్ భవన్ జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమాలతో పాటు విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షల నిర్వహణతో వారిలో భయాందోళనలు తొలగిపోతాయని అన్నారు. టాలెంట్‌టెస్ట్ సమాచారం కోసం 8106146993, 9666680674, 9398191241 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో శివనాయక్, వంశి, హరిక్రిష్ణ, రోహిత్, ప్రతాప్, గోపి, రోహిత్ ఉన్నారు.

ఆలోచింపజేసిన 'భూతకాలం'



భూతకాలం నాటికలోని దృశ్యాలు

ఖమ్మంసాంస్కృతికం,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి):ఖమ్మంభక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన భూత కాలం నాటిక ప్రేక్షకులను అలరించింది.. నెలనెల వెన్నెల సాంస్కృతిక శాఖ సహకారంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఈ నాటికను ప్రదర్శించారు. భూతకాలాన్ని పీడకలలా భావించి వర్తమాన, భవిష్యత్ కాలాలకు విలువనివ్వాలని, మనిషి గతంలో కాక భవిష్యత్తుపై ఆశతో జీవించాలని కలలు కనటంతో పాటు వాటిని సాకారం చేసుకునేందుకు శ్రమించాలని నాటిక ఉద్బోదించింది. మనిషి తన శక్తి ఏమిటో తెలుసుకొని దానికి అనుగుణంగా తన ప్రయత్నాలను ప్రారంభించాలన్నారు. అత్యాశకు పోతే ఆశించినవి దక్కక పోగా ఉన్న స్థితికూడా చేజారుతుందన్న హెచ్చరిక చేసింది. మాడభూషి దివాకర్ బాబు రచించిన ఈనాటికకు వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు.

త్వరలో టీఎన్జీవో మహిళా కమిటీ

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత టీఎన్జీవో మహిళా కమిటీని నూతనంగా ఎన్నిక చేయనున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. మహిళా విభాగాన్ని ఎన్నిక చేయడంతో పాటు జిల్లా టీఎన్జీవో డైరీని ఆవిష్కరించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఖమ్మం నగర అధ్యక్షుడిగా పనిచేస్తున్న రమణయాదవ్ పదవీ విరమణ చేసిన నేపథ్యంలో టీఎన్జీవో సంఘం నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ సెక్రటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, పోలవరపు వీరాంజనేయులు, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, ఎర్రా రమేష్, బానోత్ శ్రీధర్ సింగ్, నగ్మర్తి ప్రకాష్‌రావు, బదావత్ కరణ్‌సింగ్, ఎస్. లలిత కుమారి, తాళ్లూరి శ్రీకాంత్, భూసా చంద్రశేఖర్, యాకూబ్ పాషా, ఏలూరి హరికృష్ణ, శీలం రాధికారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్.. కార్పొరేట్ శక్తులకు అనుకూలం

» మాస్‌లైన్ నిరసన ప్రదర్శనలు



నిరసన తెలుపుతున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మంసంక్షేమ విభాగం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలతో ఏర్పాటు చేశారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, సీపై పుల్లయ్య ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా రూపొందించారని ఆరోపిసూ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అంకెలగారిడీలతో మధ్యతరగతి, పేద ప్రజల్ని మభ్య పెట్టే రీతిలో రూపొందించారని ఆరోపించారు. బడ్జెట్ రూపకల్పన దేశ, ప్రజల అవసరాలకు తగిన విధంగా లేదని కార్పొరేట్ శక్తులకు ఊతం ఇచ్చేలా రూపొందించారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటుగా తెలంగాణ రాష్ట్రానికి తీవ్రఅన్యాయం జరిగిందన్నారు. నాయకులు ఆవుల అశోక్, శిరోమణి, మంగతాయి, కోయ్యల శ్రీను, పీ.శోభా, రాయల రవికుమార్, జెర్పుల దేవ్లా, చిలకల నర్సింహారావు, లక్ష్మీనారాయణ, బొమ్మకంటి రమేశ్, రవీందర్, రామారావు, శారద, జాస్మిన్ యశ్వంత్ పాల్గొన్నారు.

విద్యారంగ కేటాయింపులు నామమాత్రమే

ఖమ్మం ఖానాపురంహవేలి: కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగ కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయని అవసరాలకు ఏ మాత్రం సరిపోవని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. ఆదివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటి సమావేశంలో మాట్లాడారు. విద్యారంగం అభివృద్ధికి నిదులు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి శాసనమండలికి పంపించాలని కోరారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

- సీపీఎం నాయకుల ఆరోపణ
- కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసన తెలుపుతూ సత్తుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ బడ్జెట్ ప్రతులను సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు జాజిరి శ్రీనివాస్, కొలికపోగు సర్వేశ్వరరావులు మాట్లాడారు. కార్యక్రమంలో వలీ, కుమారస్వామి, వెంకటేశ్వరరావు, నబీ, రామకృష్ణ, జిలానీ, సైదా, బడేమియా, బాస్కర్,



సత్తుపల్లిరూరల్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెం ప్రధాన సెంటర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య మాట్లాడారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, కమిటీసభ్యులు సగ్గుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకటరామయ్య, దూదిగం బసవయ్యకూడేలి నాగేశ్వరరావు, మోక్షానందం, వెంకటనారాయణ, స్వామి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ముదిగొండలో...

ముదిగొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ముదిగొండలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మంకెన దామోదర్, వేల్పుల భద్రయ్య, మందరపు వెంకన్న, సతీష్, జానీ, ధర్మయ్య పాల్గొన్నారు.

మధిరరూరల్‌లో...

మధిర రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌కు నిరసనగా ఆదివారం మధిరలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడారు.



మధిరరూరల్‌లో...

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శీలం నర్సింహారావు, మందా సైదులు, పడకంటి మురళీ, పాపినేని రాంనర్సయ్య, పెంటి వెంకట్రావ్, సైదులు, పూట్ల శంకర్‌రావు పాల్గొన్నారు.

బోనకల్‌లో....

బోనకల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణాకు అన్యాయం జరిగిందని, అట్టి బడ్జెట్ అమలుకు నిరసనగా ఆదివారం బోనకల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నిరసన ర్యాలీతో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు, జిల్లా నాయకుడు దొండపాటి నాగేశ్వరరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు నరేష్, బందం శ్రీనివాసరావు తదితరులున్నారు.

పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయి



కల్లూరులో భద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెటుడుతున్న పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో పర్యటించిన ఆయన పలు కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట టీజీ ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మందపాటి ముత్తారెడ్డి, గ్రాండ్ మౌలాలీ ఉన్నారు.

వైరాలో....

వైరా, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని పలు కుటుంబాలను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని విప్పలమడక గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మేడా రాణి కుటుంబంతో పాటు పలు కుటుంబాలను పరామర్శించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం నర్సిరెడ్డి, నాయకులు పణితి సైదులు, గుమ్మా రోశయ్య, మిట్టపల్లి నాగి, విజయబాయి, కనకదుర్గ పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లింగాలలో సీపీఎం నాయకుడు మట్టూరి భద్రయ్య మృతదేహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివారెడ్డి, టిఎస్ ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసీ ఛైర్మన్ భాగం నీరజదేవి, నాయకుడు పసుమర్తి చందర్‌రావులు సందర్శించి నివాళులర్పించారు. అదే విధంగా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కూడా భద్రయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.



వైరాలో మేడా రాణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు



పాలకవర్గ సభ్యులకు నియామక పత్రాన్ని అందిస్తున్న భట్టి

మధిరటౌన్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మధిర లోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో మధిర మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డితో పాటు కమిటీ సభ్యులు అద్దంకి రవికుమార్, బాణోత్ రమణానాయక్, వేల్పుల చెంచయ్య, షేక్ షన్ను కలిసి తమపై నమ్మకం ఉంచి తమను నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మధిర పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రమణ కుమార్తె యంగేజ్‌మెంట్ కార్యక్రమానికి హజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

వరమ్మ మృతికి సంతాపం

బోనకల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ పల్టీ ఘటనలో మృతి చెందిన వరమ్మ కుటుంబాన్ని ఆదివారం డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాయపడ్డ కూలీలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, సొసైటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, మరీదు శ్రీనివాసరావు, గూడ నర్సయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలతో అన్నీ నిరూపిస్తాం..

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి/వేంసూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):ఆరోపణలు నిరూపించమంటున్నారు.. సమయం వచ్చినప్పుడు అన్ని నిరూపిస్తాం... మావద్ద ఉన్న ఆధారాలు బయట పెడితే కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేరు అంటూ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం ముందస్తు అరెస్టు అయిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను వేంసూరు పోలీస్టేషన్‌లో ఆయన పరామర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట, బెట్టింగ్ తదితర ఆరోపణలు మాపై చేస్తున్నారు. గంజాయి కేసులో హైదరాబాద్‌లో పట్టుబడిన వ్యక్తి తండ్రి కూడా తనపై ఆరోపణలు చేయడం చూస్తే కాంగ్రెస్ ఆరోపణల్లో ఎంత వాస్తవం ఉందో స్పష్టం అవుతోందని అన్నారు. సత్తుపల్లి మండలం గంగారంలో కోడి పందేలు జరిగితే పోలీసులు ఏ పార్టీ వారిపై కేసు నమోదు చేశారో అందరికీ తెలుసునన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి ఆరోపణలు నిరూపించాలని కాంగ్రెస్ వారే సవాలు చేశారు. బీఆర్ఎస్ స్పందించకపోయినా అధికార పార్టీ నాయకుడు పోలీసులతో మా కార్యకర్తలను తెల్లవారుజామున అక్రమంగా అరెస్టు చేయించారు. తిరిగి పోలీస్టేషన్‌కు కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లి



మీడియాతో మాట్లాడుతున్న సండ్ర

కూర్చున్నారు. అనంతరం అధికార పార్టీనాయకుడు స్టేషన్‌కు వచ్చి తనపై మళ్లీ ఆరోపణలు చేయటమే కాకుండా పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసి సన్నివేశం రక్తికట్టించారని సండ్ర విమర్శించారు. సత్తుపల్లి నియోజకవర్గం సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలని ఒక మంత్రి బహిరంగంగానే చెప్పారంటే ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. అనేక అంశాల్లో ఏమి జరుగతోందో ప్రజలకు తెలుసునని, జాతీయ నాయకుల విగ్రహాల వద్ద చర్చ అక్కర్లేదని కాంగ్రెస్ నాయకులు ప్రజల వద్దకు వెళితే చరిత్ర వారే చెబుతారన్నారు. మేము చేసే ఆరోపణలు నిజమైతే మిమ్మల్ని, లేకుంటే మమ్మల్ని ప్రజలు శిక్షిస్తారు తప్ప మీరే సవాళ్లు చేయటం, మీరు అరెస్టు చేయించి పోలీసులను నిలదీసి చేస్తున్న డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో కూడా నిరంతరం ప్రజల్లో ఉంటాం... ప్రజల కోసం పోరాడతామని అన్నారు.

నిరాశపరిచిన బడ్జెట్: కాంగ్రెస్



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని నిరసిస్తూ ఆదివారం కల్లూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాన రహదరిపై బైఠాయించి కాంగ్రెస్ నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ భాగం నీరజ దేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, జిల్లేళ్ల కృష్ణారెడ్డి, యస్‌కే బాజీ, పెద్దబోయిన శ్రీనువాసరావు, ఆళ్లాకుంట నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మదన్‌లాల్ పరామర్శ



జగన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

కారేపల్లి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలో వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్‌మదన్‌లాల్ ఆదివారం పర్యటించారు. ఈసందర్భంగా పలు కుటుంబాలకు సంబంధించిన బాధితులను ఆయన పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాంకుడోత్ జగన్‌ను పరామర్శించారు. సీతారాంపురంలో దివ్యాంగుడు కె.నాగేశ్వరరావు, కొత్తురుతండాలో ధారవత్ హతీరాం కుంటాబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం పినపాక గ్రామంలో ఆదివారం మెట్రో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పరికాల రాముగౌడ్, డాక్టర్ జంగం సాయి కిరణ్, ఎక్కిరాల నాగేశ్వరరావు, శ్రీనివాస్, ప్రభాకర్, దుర్గాప్రసాద్, కృష్ణార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మాపై ఆరోపణలను నిరూపించాలి

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాపై చేసిన ఆరోపణలు నిరూపించాలి.... ఆయన హయాంలో జరిగిన అక్రమాలను మేము నిరూపిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు ఆయన స్టేషన్‌లో మద్దతు పలికారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇ లాంటి తప్పుడు ఆరోపణలు చేసి ప్రజల నుం చి మన్ననలు పొందుకోవాలనుకోవడం కుద రని పని అని అన్నారు. సండ్ర వెంకటవీరయ్య చేసిన డీ ట్యాక్స్ వసూలు చేసినట్లు నిరూపించగలిగితే రాజీనామాకు కూడా తాము సిద్ధమన్నారు. లేకుంటే సండ్ర రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.



సత్తుపల్లి పట్టణ సీఐతో మాట్లాడుతున్న దయానంద్

పట్టణ సీఐపై దయానంద్ ఫైర్

సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్‌పై రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఫైర్ అయ్యారు. ఆదివారం పోలీసులు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. సత్తుపల్లి పోలీస్టేషన్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దయానంద్ సీఐని నిలదీశారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందని పోలీసులు చెబుతున్నారని ఇక్కడేమైనా ఫ్యాక్షన్ రాజకీయాలు నడుస్తున్నాయా... గతం నుంచి ఏమైనా దాడులు, ప్రతిదాడులు జరిగాయా ఎందుకు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ వాళ్లని అయినా ఎందుకు అరెస్టు చేసినట్లు అంటూ నిలదీశారు. వారు చేసిన ఆరోపణలను నిరూపించాలని అడిగాం. నిరూపించాలని అడిగాం వారు రాలేదు కదా ఎక్కడ గొడవలు జరిగాయి.. ఎందుకంత ఉత్సాహం... ఏమి రిపోర్టు ఉంది... ఇంటిలిజెన్స్ రిపోర్టు ఏముంది...మహేష్ అనే వాడువచ్చాడా... లేదు కదా అట్లుంది మీ నిఘా అంటూ ఫైర్ అయ్యారు. ఎవరు ఇచ్చారు. రిపోర్టు ఎవరు ఇచ్చారు. తప్పుడు రిపోర్టులు ఇవ్వటం బదనాం చేయడం అలవాటుగా మారింది... ఎవరిని బదనాం చేయటానికి ఇదంతా అన్నారు. వాళ్లనైనా ఎందుకు అరెస్టు చేయాలి ఎందుకింత ఉత్సాహం అని ప్రశ్నించారు. స్టేషన్‌లోకి ఎవరైనా వస్తేనే కదా అరెస్టు చేయాల్సింది... మేము అరెస్టే చేపించామని అధికార పార్టీకి ఒక చెడ్డపేరు. ఇవది కారెక్టు కాదుక దా... సీపీ గారికి కూడా చెప్పాలి కదా...చెప్పండి అంటూ మండిపడ్డారు. .

ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు భద్రయ్య: తమ్మినేని

కల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ కమ్యూనిస్టు యోధుడిగా మట్టూరి భద్రయ్య నిలిచారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. లింగాల గ్రామంలో ఆదివారం భద్రయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, నున్నా వెంకటేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వరరావు ప్రసంగించారు.



భద్రయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపురంలో పొంగులేటి పర్యటన



మనవరాలు షైరారెడ్డితో మంత్రి పొంగులేటి

కల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం తన స్వగ్రామమైన నారాయణపురంలో మనవరాలు షైరారెడ్డితో సరదగా గడిపారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి పొంగులేటి నారాయణపురం వచ్చారు. ఈ సందర్భంగా తన కుమారుడైన హర్షారెడ్డి కుమార్తె షైరారెడ్డితో సరదగా గడిపారు. మంత్రి వెంట టీఎస్ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు

బోనకల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో ఆదివారం జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు తరువాత అసెంబ్లీలో వర్గీకరణ చెస్తానని చెప్పిన సీఎం మాట తప్పారని అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించనున్న లక్ష డప్పులు-వేల గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగరాజు, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట హనుమంతరావు, తాటికొండ వెంకటరత్నం, తోటపల్లి చిన సైదులు, గద్దల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే సండ్రపై విమర్శలు తగవు'



వేంసూరులో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కల్లూరు, ఫిబ్రవరి2(ఆంధ్ర జ్యోతి): సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు తగవని బీఆర్ఎస్ నాయుకులు తీవ్రంగా ఖండించారు. కల్లూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, మేకల కృష్ణ, యస్‌కె కమ్లి, కాటంనేని వెంకటేశ్వరరావులు మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో రావి సూర్యనారాయణ, కొరకొప్పు ప్రసాద్, కిరణ్ తదితరులున్నారు.

పెనుబల్లిలో....

పెనుబల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో మూడుసార్లు ప్రజల మన్ననలు పొంది గ్రామాల అభివృద్ధికి కృషిచేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యదేనని పెనుబల్లి బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం పెనుబల్లిలో బీఆర్ఎస్ నాయకుడు కోటగిరి సుధాకర్‌రావు ఇంటివద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.సమావేశంలో మందడపు అశోక్‌కుమార్, కోటగిరి సుధాకర్‌రావు, కొప్పుల గోవింద రావు, వేముల నర్సింహారావు, బండి వెంకటేశ్వర్లు, దొడ్డపనేని రవి, కోమటి ప్రసాద్, వెలివాల పుల్లయ్య పాల్గొన్నారు.

వేంసూరులో....

వేంసూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అలాంటి వారికి తగిన పాఠం చెబుతామని మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు మారోజు సురేష్, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆదివారం వేంసూరులో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు.కార్యక్రమంలో పుచ్చకాయల శంకర్‌రెడ్డి, జాబిశెట్టి కోటేశ్వరరావు రామ్మోహన్‌రెడ్డి, రాము, శ్రీను, సత్యం, శ్రీనివాసరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొణిజర్ల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తనికెళ్లలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఆనాటి చదువులు నేర్పిన గురువుల్లో విజయలక్ష్మి, విజయశ్రీ, కనపర్తి వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పెదమళ్ల విద్యాసాగర్, లేడిబోయిన మంగపతి, కాసాని నాగేశ్వరరావు, బండి లక్ష్మీనారాయణ, యాస సరస్వతి, రేవతి, శ్రీలత, సిరియాలు, కొర్లపాటి సీతారామయ్య, లేడిబోయిన వెంకటేశ్వర్లు, ఆకుతోట సత్యనారాయణ, జగదీష్, శ్రీనివాస్, సుధాకర్, బాలాజీ పాల్గొన్నారు.



కొణిజర్ల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మధిరరూరల్‌లో....

మధిర రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ఉషోదయ కాన్వెంట్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం మధిరలో ఘనంగా నిర్వహించారు. ఉషోదయ స్కూల్ స్థాపించిన నాటి నుంచి 1994-95వరకు విద్యార్థులంతా ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. ఆనాటి గురువులైన కరివేద వెంకటేశ్వరరావు, బూసా కోటేశ్వరరావు, యడ్లపల్లి శ్రీనివాసరావు, కొలగాని శ్రీనివాసరావు, కొలగాని ప్రసాదరావు, పైడిపల్లి వెంకటేశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు చావా రాధాకృష్ణ, బి.సింధుప్రియా, కట్టా ఉమాకాంత్, ముప్పా విజయశ్రీ, చంద్రిక, సుభాషిని, ధనలక్ష్మి, చావా వేణు, పీవీఎస్. రామకృష్ణ, షేక్.షాహీన్, జానీ, బన్ను, కిరణ్ పాల్గొన్నారు.



మధిరరూరల్‌లో...



మధిరటౌన్‌లో...

మధిరటౌన్‌లో....

మధిరటౌన్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మధిర జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1984-85 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమకు పాఠాలు నేర్పిన అరుణ, సత్యవేదం, సరోజిని, ఆబేదా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శిరీష, విజయలక్ష్మి, నాగమణి, ఉష, మాదవి తదితరులు పాల్గొన్నారు.